
కొత్తగా కలం పట్టిన రచయిత(త్రు)లు మాత్రమే ఈ శీర్షికలో పాల్గొనాలి ఇన్‌లాండ్ కవర్లమీదే తమ కథలను పంపాలి.



## ఇన్‌లాండ్ లెటర్ కథలు

# చక్రధారి

సుబ్బారావు ఆర్.టి.సి. బస్సు డ్రైవర్. డ్యూటీ విషయంలో అతను కూడా మిగతా వారికి ఏమాత్రం తీసిపోడు. ఎప్పటిలాగే ఆ రోజు డ్యూటీ ఎక్కాడు. అందరు డ్రైవర్లలాగే బస్సు అద్దానికి అంటించి ఉన్న దేవుళ్ళ బొమ్మలకి దణ్ణం పెట్టుకున్నాడు. ఆ బస్సు విజయనగరం నుంచి గరివిడి వెళ్ళే పాసింజరు సర్వీసు ఆ బస్సు రెండు ట్రిప్పులు నడిచింది. బస్సు మూడో ట్రిప్పులో గరివిడి నుంచి బయలుదేరింది. అపటికి సమయం 9 గం. అయ్యింది. బస్సులో సీట్లన్నీ నిండిపోయాయి. తరువాతి స్టేజి వచ్చేసరికి బస్సులో ప్రయాణీకులు నిలబడాల్సి వచ్చింది. తరువాతి స్టేజీల్లో ప్రయాణీకులు బస్సు కోసం ఎదురు చూస్తున్నారు. వారంతా బస్సు ఆపమని చేతులు ఊపుతున్నారు. సుబ్బారావు వేగం తగ్గించి ఆపినట్టుగా ఆపి వేగం పెంచేసాడు. బస్సు ఆపలేదు. బస్సు కోసం ఎదురు చూస్తున్న ప్రయాణీకుల కేకలు, పరుగుల శబ్దం సుబ్బారావుకి స్పష్టంగా వినిపిస్తోంది. సుబ్బారావు తాను చక్రధారి నన్న విజయగర్వంతో చిన్న నవ్వు నవ్వుకున్నాడు.

సుబ్బారావుది పాలకొండ దగ్గరలోని ఓ గ్రామం. ఓ రోజు అతని రెండేళ్ళ కొడుక్కి బాగా జ్వరం వచ్చింది. ఎప్పటికీ తగ్గలేదు. ఓ ఊళ్ళోని చిన్న డాక్టరు శ్రీకాకుళం తీసుకెళ్ళమని సలహా ఇచ్చాడు. సుబ్బారావు తన భార్యతో సహా కొడుకుని భుజం మీద వేసుకొని బస్సు కోసం ఎదురు చూస్తున్నాడు. రోడ్డు మీద జనం బాగానే ఉన్నారు. మొదటి బస్సు ఖాళీగానే వచ్చింది. ప్రయాణీకులు ఎక్కడంతో కూర్చోటానికి సీట్లు లేక సుబ్బారావు ఆ తరువాతి బస్సు ఎక్కవచ్చని ఊరుకున్నాడు. తరువాత రెండు బస్సులు చాలాసేపటికి వచ్చాయి. కాని ఈ జనాన్ని చూసి బస్సులు ఆపలేదు. సుబ్బారావు కొడుక్కి జ్వరం తీవ్రత ఎక్కువై మూలుగుతున్నాడు. సుబ్బారావు అక్కడికి వచ్చి మూడు గంటలయ్యింది. తరువాత వచ్చిన బస్సులు ప్రయాణీకుల్ని పరుగులు తీయించాయి. అందరిలాగే సుబ్బారావు కూడా పరుగులు పెట్టాడు. ఎట్టకేలకు బస్సు ఒకటి ఆగింది. సుబ్బారావు అతి కష్టం మీద బస్సులోకి భార్యతో చేరుకున్నాడు. ఇంతలో సుబ్బారావు కొడుకు నుంచి మూలుగు ఆగిపోయింది. గుండె మీద చేయి వేసి చూసేసరికి గుండె కొట్టుకోవడం ఆగిపోయింది. సుబ్బారావు ఒక్కసారిగా గావుకేక పెట్టాడు. సుబ్బారావు భార్య 'ఏ జన్మలో ఏం పాపం చేసామో! కొడుకు దూరమయ్యాడు' అని ఏడవ సాగింది. సుబ్బారావుకు మాత్రం చక్రధారిగా తను చేసిన పాపమే గుర్తుకు వచ్చింది.

— బొత్స

# చేజారిన అదృష్టం

సుధీర్ రోడ్డుపై నడుస్తున్నాడు. హఠాత్తుగా అతని దృష్టి ఓ చోట పడింది. దానికి కారణం నల్లటి తారు రోడ్డుపై వచ్చగా మెరిసే నోటు కనబడడమే. అతని ముఖం వెయ్యి ఓల్టుల బల్బులా వెలిగిపోయింది. దీనితో తన కుటుంబం యొక్క ఆకలి బాధ కొంతవరకూ తీర్చవచ్చు. ఇప్పటివరకూ కాళ్ళు అరిగేలా ఎన్ని ఉద్యోగాలకు తిరిగాడో, తనకోసం ఆశగా చూసే తల్లిదండ్రులు, చెల్లి మనసులో మెదిలారు.

ఇలా ఆలోచనల్లో వుండగానే – "పిల్లి" గుర్తుకే మీ ఓటు అని ఒక ఊరేగింపు. "కుక్క" గుర్తుకే మీ ఓటు అని మరో వైపు ఊరేగింపు. ఆ రెండు పార్టీలతోనే రోడ్డు నిండిపోయింది. కాని సుధీర్ ధ్యాసంతా వేరే వుంది. ఏ పార్టీకి ఓటు వేస్తేనేం. తనలాంటి నిరుద్యోగులు మాత్రం ఉద్యోగులుగా మారరు. ఆ పార్టీలంతా తమ కడుపులు నింపుకోడానికే అని ఈ అమాయక జనానికి తెలిసేదెప్పుడు?

ఇలా ఆలోచనల్లో వుండగానే పచారీ కొట్టు కనిపించింది సుధీర్ కళ్ళకి. ముందు వాడి బాకీ తీర్చేయాలి. ఎప్పటి నుండో వున్నాడు పాపం అనుకుంటూనే జేబులో చెయ్యి పెట్టిన సుధీర్‌కి ఆ వెయ్యి ఓల్టుల బల్బు షాక్ కొట్టినట్లు అనిపించింది. కారణం అతని జేబులో లేదు ఆ నోటు. అప్పుడు గుర్తొచ్చింది ఇందాక ఊరేగింపులో తన జేబు ఎవరో కొట్టేసారని. తన కన్నా దురదృష్టవంతుడై వుంటాడు వాడు. ఏం బాబూ! ఏమైనా కావాలా? అన్న కొట్టువాడి మాటలకు ఇప్పుడే వస్తాను అని వెళ్లిపోతున్న సుధీర్‌వైపు వింతగా చూస్తుండి పోయాడు షావుకారు. 'చేజారిన అదృష్టం' అంటే ఇదే కాబోలు అనుకున్నాడు సుధీర్.

— దేవి

# మనసు

ఒకరిని చూడగానే ఇష్టమెందుకు కలుగుతుందో చెప్పలేను గాని 'సురేష్'ని చూడగానే నాలో ఒక విధమైన ఆకర్షణ, ప్రత్యేకత అతని మీద ఏర్పడింది...

"నీ చూపులలో చాలా రకాల భావాలున్నాయి. అదేమిటో అడగను కాని నన్ను ఇంత అభిమానంగా చూసే మీరు దొరికినందుకు సంతోషిస్తున్నాను థ్యాంక్యూ" అని వెళ్ళిపోయినప్పుడు నాకు మాత్రం చదివిన చదువుకు సర్టిఫికెట్ దొరికినంత ఆనందం కలిగింది. తరచూ ఆఫీస్ వేళల్లో కలిసినా, నాకిష్టమైనప్పుడు నా తీరిక వేళల్లో కూడా అతన్ని కలుస్తూ ఉండేదానిని ఆ విధంగా అతనితో నా స్నేహాన్ని ముడివేశాను. ఆ వంకతో చాలాసార్లు అతనికి నా మీద ఇష్టం కలిగేటట్లు చేసేదానిని.

ఉషగారూ... మీరు నా మీద ఎందుకింత చొరవ చూపుతున్నారో అర్థం కావడం లేదు అని అతను ఆశ్చర్యం ప్రకటించినప్పుడు.

బోసిపోయిన ముఖంతో ఇకముందు కలవద్దంటే చెప్ప వెళ్ళిపోతాను.

ఇకమీదట ఎప్పుడూ నిన్ను కలవను అనేసాను.

కలవద్దని కాదు నామీద ఎందుకింత అభిమానం అని అడిగినప్పుడు నా సమాధానం ప్రేమ అని బయట పెట్టలేక తప్పించుకుంది.

ఆ తరువాత ఉన్నట్టుండి రెండు రోజులుగా ఎంత ప్రయత్నించినా ఎంతకీ కనబడకపోయేసరికి ఉండబట్టలేక ఇంటికి వెళ్ళాను.

అక్కడ అతను తన భార్యతో సరదాగా గడుపుతున్నాడని విస్తుపోయాను. తనకీ పెళ్ళయిన విషయం ఇంతవరకు నాకు తెలియందే ఇంతవరకు అతన్ని చూడందే ఉండలేనని మొరాయించిన మనసు ఇప్పుడు మొండిగా ఉండగలను అంటోంది.

— పి. శివాజీ